
# అవసరం



కోటమర్తి రాధాహిమబిందు

మధురమ్మ చిరాకు వినయ్‌లో ఆలోచనలు రేకెత్తించింది... 'ఏంటీ భరత్ వాళ్లమ్మ గారు అమ్మతో కలివిడిగా ఉండదా... అదేం టి? ట్రాన్స్‌ఫరై వచ్చిన తనకు మంచి యిల్లు చూపించాడు భరత్... అదీగాక యిదివరకు పొరుగు అస్సలు నచ్చలేదురా... మీరు మా ప్రక్కింట్లోనే ఉండబోతున్నారంటే ఎంతో హ్యాపీ గా ఉంది. మా అమ్మకు టైమ్‌పాస్‌గా ఉంటుం దన్నాడు. తనూ అమ్మ విషయంలో నిశ్చింతగా ఫీలయ్యాడు... యిదేమిటి?

"ఏంటోరా... ఎక్కడకీరాదు... నువ్వేమో ఫ్రెండో ఫ్రెండో అని యిక్కడ యిల్లు చూశావు... నీ ట్రాన్స్‌ఫర్ ఏమోగాని కోడలు, పిల్లల్ని అక్కడే వదిలి రావాల్సి వచ్చింది... ఏం ఉద్యోగాలో ఏమో... చెరోచోటా బ్రతుకులాయె... నాకు బోర్ కొడుతోందిరా... నేను నా కోడలు దగ్గరికే వెళ్లిపోతాను".

"అమ్మా... మనం వచ్చి యిరవైరోజు లన్నాకాలేదు. అంతా కొత్త... మెల్లమెల్లగా అల వాటు పడాలి. ఫ్రెండ్‌గాబట్టే గదా యింత మంచి యిట్లు చూసిపెట్టాడు... నువ్వు వనజ దగ్గరికి వెళ్లిపోతానని బెదిరిస్తే ఎట్లా చెప్పు? మా అత్తగారు తనకు అండగా ఉన్నారు గదా... అమ్మా... నువ్వే మధ్య మధ్య వెళ్తూండు... ఆవిడా వస్తూంటుంది..."

"యింకా నయం... యిప్పటికే నాలుగైదు సార్లు వెళ్లాను"

"భరత్ వాళ్లమ్మ ఒక్కసారి కూడా మనిం టికి రాలేదమ్మా."

"ఒకసారి వచ్చిందిలే... ఎంతోసేపు ఉండలేము... ఏవో పనులున్నాయని వెళ్లిపో యింది. భర్త మరో ఏడాదిలో రిటైరవుతాడట... భర్త ఆఫీసర్... కొడుకు ఆఫీసర్... కోడలు... నా కోడల్లాగా ఉద్యోగస్తురాలు... ఎంత హ్యాపీ లైఫ్ ఆవిడది... ఓ గుడిలేదు గోపురం లేదు... ఓ సినిమాలేదు చిప్పలేదు... యిరవై నాలుగు గంటలూ ఆ యింట్లో ఎలా మగ్గుతుందో ఏమో?"

"మనం యిలా ఆలోచిస్తున్నాం. ఆవిడ పరిస్థితి ఏంటోనమ్మా."

"ఏమోరా... మాట్లాడే వాళ్లు లేక పరమ చిరాగ్గా ఉంటోంది. టి.వి. ఎంతసేపని చూడ ను? అందులో కంటిన్యూగా టి.వి. చూడాలంటే నాకెంత విసుగో నీకు తెల్సుగా. యిక పేపర్ క్షుణ్ణంగా చదివేస్తున్నాను. రోజూ సాయంత్రం క్విజ్ పెట్టినా, రిటెన్ టెస్ట్ పెట్టినా... మైనస్ మార్క్సు అయినా నోప్రోబ్లం... సెంట్ పర్సెంట్ మార్క్సు కొట్టేస్తాను... ష్యూర్..."

నవ్వుతూ తల్లి దగ్గరికి వచ్చి తల్లి భుజాల చుట్టూ చేయివేసి దగ్గరగా పొదువుకున్నాడు ప్రేమగా...

★ ★ ★

వనభోజనాలు అనేసరికి మధురమ్మ ఆనం దం అంతా యింతా గాదు. అక్కడ చాలామంది పరిచయం అవుతారని ఓ పెద్ద ఆశ, ఆ ఏర్పా ట్లన్నీ చూసేది భరత్ తండ్రి సూర్యనారాయణ గారని తెల్సి... ఆ తల్లీ కొడుకూ ముఖ్యపాత్ర వహించారు. భరత్, నీలిమ వాళ్లకు అసిస్టెన్స్ యిచ్చారు. సరస్వతి కూడా పనులు బాగానే చేసింది.

మధురమ్మ ఆశపడినట్లుగా వనభోజనాల కారణంగా చాలామందే పరిచయం అయ్యారు ఆమెకు. నాలుగు రోజులు గడిచాయి. తల్లి ఊరికి వెళ్తానని అనకపోవటంతో కాస్త ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నాడు వినయ్.

రైతు బజారులో సరస్వతి కన్పించేసరికి వినయ్ మనసు పులకరించినట్లు అయింది. వెళ్లి ఆమె ప్రక్కగా నిలబడ్డాడు.

"నమస్తే అమ్మా"

"నమస్తే... ఒక్కడివే వచ్చావా బాబూ"

"అవునమ్మా. ఆ బాగ్ యిటివ్వండమ్మా. నేను పట్టుకుంటాను" సరస్వతి ఎంత వద్దన్నా బలవంతంగా తీసుకుని స్కూటర్ మీద యింటి దాకా డ్రాప్ చేశాడు.

"బాబూ"

"ఏంటమ్మా"

"అమ్మగారు గోదావరి స్నానానికి వెళ్లాం రమ్మన్నారు. ఏభై అరవై కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. అంత ఓపిక నాలో లేదు. అలాగే అంతా ఏదో పిక్నిక్ ప్లాన్ చేస్తున్నారట. అది కూడా వీలవదని చెప్పు బాబూ. మీ మామయ్య గారు ఆ రోజు యింట్లోనే ఉంటున్నారు. ఫ్రెండ్స్‌కి పార్టీ యిస్తున్నారు. అదీగాక అబ్బాయికి, కోడలికీ క్యారియర్లు పంపాలి."

"చెప్తానండీ."

"వస్తాబాబూ థ్యాంక్యూ"

"అయ్యో... ఎంతమాటమ్మా".

చిరునవ్వుతో ఆప్యాయంగా చూసి, గేటు తీసుకుని వెళ్లిపోయింది సరస్వతి. ఐక్క పలుచగా లేత తమలపాకులా ఎంతో నాజూగ్గా కన్పించే ఆవిడన్నా... ఆవిడ చిరునవ్వు అన్నా వినయ్‌కి అత్యంత యిష్టంగా అయిపోయింది. వినయ్‌కి అర్థంగానిది ఒక్కటే. ఆవిడ వాళ్లవాళ్లతో తప్ప ఎక్కడికీ బయటకెళ్లదు. ఏ మాత్రం సమయం చిక్కినా యిరుగుపొరుగు వారితో మాట్లాడాలనుకుంటారు సహజంగా. కాస్త ఎక్కువ తీరిక దొరికితే అలా అలా తిరిగి రావాలనుకుంటూంటారు. ఆవిడ అలా ఎందుకనుకోదు? యింట్లో అంతా చాలా మంచివాళ్లే గదా!

అయినా ఆమె పరిస్థితి ఏంటోనమ్మా అని తల్లితో అన్న తను మాత్రం ఎలా కనుక్కోగలడు?

వారం రోజులు గడిచాయి.

"అబ్బబ్బ... ఏం మనిషో ఏమో? ఓ సరదా లేదు, పాడులేదు. అంతా వెళ్తున్నామాయె. పిలవకుంటే ఏం బాగుంటుందని పిలిచాను. ఏ కళ నుందో గానీ వచ్చింది. సర్కస్ చూడక చాలా సంవత్సరాలైంది గదరా. నేనైతే చిన్న పిల్లనే అయిపోయాననుకో. ముభావంగా ఉండే ఆవిడను ఎంతని వాగించను? అయినా యింకోసారి నేను పిలవనురా. బయట ఏవేవో కొనుక్కుని మేమంతా తీసికెళ్లామా? తను ఏమీ కొనుక్కోలేదు. పోనీ లోపలేమైనా కొనుక్కుందా అదీలేదు. తను కొనుక్కోలేదు గదా అని నేను యివ్వబోతే వద్దని తిరస్కరిస్తుంది. ఏంటోరా బాబూ చాలా విచిత్రపు మనిషి..."

తల్లి మాటలు తలకెక్కటం లేదు వినయ్‌కి. అతని మనసు వేరే దిశగా ఆలోచిస్తూ నాణానికి రెండో వైపు చూసింది.


* * *

"ఏంట్రా ఏదో మాట్లాడాలని యింత దూరం తీసుకొచ్చి అలా మౌనంగా ఉన్నావ్?"

"అరేయ్... నువ్వు నాకు మంచి ఫ్రండ్‌వి. నీతో ఒక విషయం చర్చించాలని ఉందిరా. నువ్వు ఏమైనా అనుకుంటావేమో అని భయంగా ఉంది".

వినయ్ చేతిని తన చేతులలోకి తీసుకున్నాడు భరత్.

"అరేయ్.. యింటర్, డిగ్రీ కల్సి చదివాం. మనం ఎంతో క్లోజ్ ఫ్రండ్స్‌ం. నేను బితుకు బితుకుమంటూ హాస్టల్‌లో ఉన్నప్పుడు నువ్వు నాకెంత ధైర్యం చెప్పావో యిప్పటికీ నాకు గుర్తుంది. అలా ఏదీ మర్చిపోలేదు. కాకపోతే




ఉద్యోగపరంగా ఎక్కడెక్కడో తిరిగి యిక్కడికి చేరాను. యిలా మళ్లీ మనం కలిసే యోగం రావటం ఎంతో అదృష్టంగా అనుకుంటున్నాను. వినయ్... నేను నీ గురించి ఏదో అనుకోవటమా? యింపాజిబుల్. చెప్పరా" మార్దవంగా అన్నాడు భరత్...

"డైరెక్ట్‌గా విషయంలోకి వస్తున్నానురా."

"చెప్పరా"

"ప్రతిచోటా దేవుడు ఉండలేక అమ్మని సృష్టించారంటారు నిజమేనా?"

"ఖచ్చితంగా నిజం"

"మీ అమ్మని నువ్వు ఎలా చూసుకుంటావురా?"

"బాగానే... ఏం... ఎందుకు?"

"బాగానే అంటే ఏంటి? ఎలా?"

"అదేంట్రా అలా అడుగుతావు?"

"నేను వచ్చిన రోజు నన్నెంతో పొగిడావు. తమ్ముడ్ని బాగా చదివించి, ఫారిన్ పంపానని మెచ్చుకున్నావు. నాన్నగారు చనిపోయిం తర్వాత చెల్లెలి పెల్లి చేసినందుకు ప్రయోజకుడినయ్యానన్నావు. అమ్మను ప్రేమగా చూసుకుంటున్నందుకు 'నువ్వురా మనిషంటే' అంటూ నీ మంచి మనసుతో ఓ అవార్డుయిచ్చావు".

"వినయ్..." అర్థంగాలేదు భరత్‌కు.

"నాకున్న సమస్యలు కూడా నీకు లేవు... నేనో లెక్చరర్ని. నువ్వు పెద్ద ఆఫీసర్‌వి. నాకంటే డబుల్ జీతం నీకొస్తుంది..."

"యింతకూ విషయం ఏంటి వినయ్."

"చెప్తాను భరత్. మీ అమ్మగార్ని నువ్వు సరిగా పట్టించుకోవటం లేదని అంటున్నాను."

"వినయ్"

"యస్. మీ నాన్నగారికి ఫ్రండ్స్... పార్టీలు కావాలి. నీకు ఉద్యోగం... సంపాదన... అంతే గదూ. పాపం మీ అమ్మగారు ఎంత యాంత్రికంగా పనులు చేస్తుంటారో... పైగా యింటి యజమాని, గృహలక్ష్మి అని... నీ లాంటివాళ్లు

బిరుదులు కూడా యివ్వగలరేమో."

"వినయ్.. రియల్లీ నాకేం అర్ధంగావటం లేదురా".

"అర్ధం చేసుకో భరత్... ఒక్కసారి బాల్యం లోకి వెళ్లు. మనం చిన్నతనంలో పెన్సిల్స్... రబ్బర్స్... పెన్స్... బుక్స్... యిలా ఎన్నెన్నో పారేసేవాళ్లం. నాన్నలు తిడతారని అమ్మలు వాటిని మళ్లీ కొనిపెట్టే వాళ్లు. అదీ చాటుగా రహస్యంగా. అమ్మకు మనపట్ల ప్రేమ యిప్ప టికీ అలాగే ఉంటుంది. అందులో నో డౌట్. అందుకే మీ ఆరోగ్యాలు చెడతాయేమో అని వేడి వేడి యింటి భోజనం క్యారియర్లలో పంపుతున్నారు".

"వినయ్... అమ్మ పట్ల నాకెప్పుడూ ప్రేమ ఉంది. నువ్వు మరోలా ఎందుకనుకుంటు న్నావ్?"

"నువ్వు గమనించని విషయం, పరిస్థితి నేను గమనించాను గాబట్టి. వనరుల గురించి గాదు నేను మాట్లాడేది. అవసరాల గురించి. ప్రేమ, బాధ్యత కంటే ముందు అవసరం గురించి ఆలోచించు"

"అవసరం గురించా...? ఏం అవసరం ...? ఎలాంటి అవసరం?"

"మీ నాన్నగారి సంగతి నీకు తెల్సు. వది లెయ్. నీకు ఆవిడ అమ్మ. ఆవిడంటూ లేకపోతే మనం లేము. మనకు జన్మనిచ్చిన తల్లికి మనం ఏం చేస్తున్నామని ఒక్కసారి ప్రశ్నించుకుంటే మనకెంతో తృప్తి కలిగే విషయాలు... సంఘట నలు మన కళ్లముందు రీలులా కదలాడాలి."

"వినయ్"

"మీ అమ్మగారికి సరదా సంతోషాలు ఉండవా? ఆవిడ సరదా సంతోషాలకి నువ్వు ఏ రకంగా న్యాయం చేస్తున్నావు? పని మనిషి ఉంది. ఓకే... మరి యింట్లో పనులు కావా లిగా. బయట కూరగాయలు ఆవిడే తేవాలి. సరే... ఒకసారి అలా తిరిగి వచ్చినట్లవుతుంది అని తనే వెళ్తుందేమో... ఎప్పుడో మీరు వెళ్తే మీతోపాటు బయటకు తీసికెళ్తారు. అదీ చాలా తక్కువగానే... యివన్నీ యాంత్రికం.

అమ్మ కోసం కొడుకుగా నువ్వేం చేస్తు న్నావు"?

"నేనా... ఏం చేస్తాను వినయ్... స్పెషలై జేషన్ అంటూ ఏముంటుంది"

"ఆవిడ అవసరాలకు డబ్బు ఎవరివ్వాలి?"

"నాన్నగారు".

"యిస్తున్నారా? గమనించావా?"

"లేదు. గమనించలేదు"

"నువ్విప్వకూడదా?"

"ఎందుకివ్వను? అమ్మ అడగలేదు"

"హు... ఏ తల్లీ కొడుకుని చేయిచాచి డబ్బు అడగదు. అందునా మీ అమ్మగారి లాంటి వాళ్ళు అస్సలు అడగరు. ఆవిడ అవసరాలు, ఖర్చులూ నువ్వు గమనించలేవా?"

"వినయ్"

"అమ్మగావచ్చు... అమ్మమ్మగావచ్చు... తాతమ్మగావచ్చు. ఆవిడకు కోరికలు ఉంటా యి. జిహ్వ ఉంటుంది. బజారులో ఎర్రటి యా పిల్ కన్పిస్తుంది. పూలు కన్పిస్తాయి. యింకా ఏవేవో కన్పిస్తాయి. యివి మామూలు. పదో యిరవైతోనో అయిపోతుంది. ఏ ఊరో వెళ్లాలి. ఏ చీరో కొనుక్కోవాలి అన్పిస్తుంది. ఎవరికో ఏభయ్యో... వందో యివ్వాలనుకుంటుంది. ఏ యాగమో చేయించాలనుకుంటుంది. పిక్చ ర్స్... సర్కస్‌లు... గుళ్లు గోపురాలు యిలా తన యిష్ట పూర్తిగా ఖర్చులు పెట్టే అవసరం

వస్తుంది. అప్పుడు డబ్బు ఉండాలిగా. మరెలా? యిదిగో యిప్పుడు మీ అమ్మగారిలా ఎక్కడికీ బయటకు వెళ్లరు. ఏదో వంక సృష్టించుకుంటారు".

"వినయ్"

"భరత్ నేనేదో గొప్పకని చెప్పుకోవటం లేదు. నాకు పదిహేను వందల జీతం వచ్చినా అమ్మను యిలాగే మహారాణిలా చూసుకోవాలనుకున్నాను. ఎన్నాళ్లు అమ్మ మనకోసం కష్టపడాలి? కొంతలో కొంతైనా సుఖపెట్టాలి అనుకున్నాను. పాటించాను. జీతం రాగానే అమ్మకు కొంత డబ్బు యిస్తాను తన ఖర్చుల కోసం. ఎప్పుడో యిదిగోరా మిగిలాయి అని నాకివ్వబోయినా తీసుకోను. కొడుకుగా ఎలాంటి అసౌకర్యం కల్గించకూడదని నిర్ణయించుకున్నాను. కొడుకు సమర్థుడు అయితే కోడలూ తప్పక సమర్థురాలవుతుంది. నేను ఎలా ఉంటానో నా భార్య అలాగే ఉంటుంది. అమ్మ విషయంలో...

అమ్మ కోసం నిస్వార్థంగా... నిస్సంకోచంగా... ఎలాంటి నాటకీయతా లేకుండా ప్రేమతో బాధ్యతగా చేసేదే తల్లి మనసు దాకా చేరుతుంది. పుత్రుడు అనిపించుకోవటం ఏముందిరా... సుపుత్రుడు అని అనుకోబడటమే గొప్ప విషయం".

వినయ్ అలా మాట్లాడుతూనే ఉన్నాడు. భరత్ వింటూనే ఉన్నాడు.

★ ★ ★

"అమ్మా... ఈ రోజు నుంచి తులశమ్మగారు వంట చేయటానికి వస్తున్నారు. నువ్వు పైపైన చూసుకుంటే చాలు. కూరగాయలు నేను తెప్పిస్తాను. అంతదూరం నువ్వెళ్లకు. యిదిగోమ్మా ఈ ఐదువందలు నీ ఖర్చుల కోసం ఉంచుకో. ప్రతినెలా యిలా యివ్వాలనుకుంటున్నాను. సరదాగా ఎటైనా వెళ్తుండమ్మా. అమ్మా నువ్వంటే నాకెంతో యిష్టం" అంటూ తల్లి చేతిలో డబ్బు ఉంచి చకచకా వెళ్లిపోయాడు భరత్.

సరస్వతి నోటమాట రాలేదు.

యిదంతా గమనించి సూర్యనారాయణ గదిలోకి తప్పుకున్నాడు. ఆ రాత్రి నీలిమ తన అన్నకు ఫోన్ చేసింది. తమ తల్లి గురించి జాగ్రత్తలు తీసుకోమని. అమ్మ ఖర్చుల కోసం ఎంతో కొంత డబ్బు యివ్వమని.

మూడోరోజున సరస్వతి మధురమ్మకు ఫోన్ చేసింది. "నాలుగు రోజులు ఏదో పిక్నిక్ ప్రోగ్రామ్ వేసుకున్నారట గదా... నేనూ వస్తున్నాను... నేను నాలుగు రకాల ఐటమ్స్ తెస్తాను... అబ్బే యిబ్బంది ఏముందండీ... అన్నీ మా తులశమ్మగారే చేస్తారు. ఉంటానండీ."

మధురమ్మ ఆశ్చర్యపోతూ కొడుకుతో ఈ విషయం చెప్పింది.

వినయ్ పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. ●

## విలువేంది?

కొత్తగా పెళ్లైన ఓ భర్త ఆఫీసునించి ఆలస్యంగా ఇల్లు చేరాడు.

భార్య: 'ఏం ఇంత ఆలస్యం చేశారూ? అపుడే మోహం మొత్తిపోయిందా కాపురం? ఆయ్!'

భర్త: నీ బుద్ధి పోనిచ్చుకొన్నావ్ కాదు... జరిగిందేంటంటే, దార్లో ఓ దొంగాడు అడ్డగించి డబ్బా, వాచీ ఇస్తావా లేక ప్రాణం తీయమంటావా అన్నాడు. ఇంతలో...'

భార్య: 'ఓలమ్మో! కొంపదీసి మా నాన్న మనపెళ్ళికిచ్చిన వాచీ, వాడడిగిన డబ్బా ఇచ్చేసారా ఏంటీ?'

భర్త: !!!